క్లుప్తంగా

అనాథాశ్రమ నిర్వహణ అభినందనీయం



అనాథలతో మాట్లాడుతున్న భానుమతి

కొత్తగూడెంటౌన్: అనాథలకు అన్నం పెట్టి కడుపు నింపడం చాలా గొప్ప విషయమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సింగరేణి హెడ్ ఆఫీస్ ఎదురుగా చమాన్ బస్తీలోని ముత్తబాయి మెమోరియల్ శ్రీజ్యోతి అనాథాశ్రమాన్ని ఆమె సందర్శించారు. మాట్లాడుతూ.. దాతల సహకారంతో ఇలా అనాథాశ్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఎయిడ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ వి.పురుషోత్తమరావు, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి.నిరంజన్‌రావు, అసిస్టెంట్ కౌన్సిల్ జి.నాగస్రవంతి, జ్యోతి విశ్వకర్మ, న్యాయవాది మెండు రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

మెప్మా కమిటీ ఎన్నిక



మెప్మా నూతన కమిటీ సభ్యులు

పాల్వంచ: మున్సిపాలిటీలోని మెప్మా రిసోర్స్ పర్సన్ల నూతన కమిటీని గురువారం స్థానిక కార్యాలయంలో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షురాలిగా మొగిలి సంధ్య, కార్యదర్శిగా కాటారపు మంజుల, కోశాధికారిగా కడారి స్వరూప, ఉపాధ్యక్షురాలిగా మిరియాల లక్ష్మి, సహాయ కార్యదర్శిగా ముదిగొండ సామ్రాజ్యంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే అనుమతుల్లో జాప్యం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి అధికారుల నిర్లక్ష్యంతోనే కొత్తగూడెం ఏరియాలోని వీకే–ఓసీకి అనుమతి ఆలస్యమవుతోందని ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వీరస్వామి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్లకాలంలో ఎనిమిది భూగర్భ గనులను మూసివేయగా.. బొగ్గు వెలికితీతకు అవకాశం ఉన్న వీకే–7షాఫ్ట్‌ను కూడా మూసివేశారని పేర్కొన్నారు. అయినా కొత్త గనుల ప్రారంభంలో నిర్లక్ష్యం వహిస్తుండడం సరికాదన్నారు.

‘సీజనల్స్’పై జాగ్రత్తలు తీసుకుంటాం..



మాట్లాడుతున్న రామకృష్ణ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్, ధన్‌బాద్, రామవరం, సత్తుపల్లి ప్రాంతాల్లోని కార్మికవాడల్లో కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు సీజనల్ వ్యాధులు రాకుండా తగు చర్యలు తీసుకుంటామని ఏజీఎం సివిల్ చివుకుల రామకృష్ణ తెలిపారు. ఏరియాలో ఏజీఎం (సివిల్)గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏరియాలో జంగిల్ కటింగ్ చేయించడమే కాకుండా, కాలనీలు శుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రోడ్లకు ఇరువైపుల బ్లీచింగ్, వారంలో ఒకరోజు ఏరియా మొత్తం ఫాగింగ్ చేయిస్తామన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు సకాలంలో వేతనాలు అందేవిధంగా కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేస్తానన్నారు.

చూద్దాం.. విందాం.. నేర్చుకుందాం..

ఏదైనా విన్నది నేర్చుకోవడం కంటే ప్రత్యక్షంగా దృశ్య రూపంలో చూస్తే ఎక్కువ కాలం గుర్తుండి పోతుంది. విద్యార్థులకు పాఠ్యాంశాలు అర్థవంతంగా బోధించేందుకు ప్రభుత్వ పాఠశాలలు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్నాయి. ఈ క్రమంలో పాఠ్యాంశాలను డిజిటల్ పద్ధతిలో తెరపై బోధించేందుకు ఉన్నత పాఠశాలల్లో అందుబాటులోకి తీసుకొచ్చింది విద్యాశాఖ. ఈ విధానంతో విద్యార్థులకు పలు ప్రయోజనాలు కలుగుతున్నాయి. భవిష్యత్‌లో ఇవి మరింతగా ఉపయోగపడతాయని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆశిస్తున్నారు.

- ఆడియో, వీడియో పాఠాలతో సులభంగా అవగాహన
- ఆకట్టుకుంటున్న ప్రత్యేక తరహా బోధన
- ప్రభుత్వ పాఠశాల్లో మెరుగుపడుతున్న ఫలితాలు





డిజిటల్ పాఠం వింటున్న విద్యార్థులు (ఇన్‌సెట్) ప్రొజెక్టర్

ఇల్లెందురూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ పద్ధతిలో పాఠ్యాంశాలు బోధించాలని సంకల్పించిన విద్యాశాఖ ఈ విధానాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తూ వచ్చింది. 2016లో పాఠశాలల్లో టీవీ ద్వారా విద్యార్థులకు డిజిటల్ తరగతులను అందుబాటులోకి తీసుకొచ్చింది. డిజిటల్ తరగతుల ద్వారా విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందడంతోపాటు మంచి ఫలితాలు వచ్చాయి. దీంతో డిజిటల్ తరగతులను ఆధునీకరించి ప్రొజెక్టర్లను అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం ఐఎఫ్‌టీ (ఇంటర్‌ఫేస్ ప్యానెల్ ప్లాట్‌ఫాం) పద్ధతిలో డిజిటల్ తరగతుల బోధన కొనసాగుతోంది.

పలు ప్రయోజనాలు...

ప్రొజెక్టర్ ద్వారా పాఠాలు బోధించడం వల్ల విద్యార్థులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతున్నాయి. సాధారణంగా తరగతి గదిలో ఉన్న విద్యార్థులకు ఒకసారి ఉపాధ్యాయుడు బోధించిన పాఠ్యాంశాలను పూర్తిగా అర్థం చేసుకునే పరిస్థితి ఉండదు. ఇది కొందరికే సాధ్యం.

చదువులో వెనుకబడిన విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపేందుకు ఈ విధానం ఎంతో ఉపయోగపడుతుంది. అలాంటి వారికి ప్రొజెక్టర్ ద్వారా మళ్లీ వివరిస్తే స్థిరంగా వారి మెదడులో నిలిచిపోతుంది. ఇలా తెలుగు, ఇంగ్లిష్, సైన్స్, సాంఘిక, గణిత శాస్త్రాలలో పాటు హిందీ పాఠాలను ఏ రోజుకారోజు ఉపాధ్యాయులు చూపించి, వినిపిస్తున్నారు. ప్రత్యేక గదిలో ఏర్పాటు చేసిన ప్రొజెక్టర్ ద్వారా దృశ్య రూపంలో విద్యార్థులకు పాఠాలను వివరించడంతో స్థిరంగా గుర్తుండిపోతున్నాయి. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు వినని విద్యార్థులు ప్రొజెక్టర్ గదిలో తెరపై బోధనపై ఆసక్తి చూపుతున్నారు. పరీక్షలు రాయాల్సి వచ్చినప్పుడు వారి మెదడులో ప్రొజెక్టర్ ద్వారా విన్న పాఠాలు గుర్తుకొస్తాయి. పరీక్షలో వచ్చిన ప్రశ్నలకు సమాధానాలు సులభంగా రాస్తారని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

కొత్త విషయాలు తెలుస్తున్నాయి



తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధించినప్పుడు కొన్ని అంశాలను గుర్తుంచుకోలేకపోతున్నాం. అన్ని అంశాలపై మళ్లీ ప్రొజెక్టర్ ద్వారా విని, చూడడం వల్ల అన్నీ గుర్తుంటున్నాయి. ప్రొజెక్టర్‌లో చూడటం వల్ల ముఖ్యమైన అంశాలు మరింతగా తెలుసుకోగలుగుతున్నాము. ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంది.

– జి.శృతి, 10వ తరగతి, చల్లసముద్రం హైస్కూల్

బోధన బాగుంది..



డిజిటల్ బోధనలో ఉదాహరణలతో పాఠ్యాంశాల బోధన ఆసక్తిగా ఉంది. ప్రతి అంశాన్ని సులువుగా అర్థం చేసుకోగలుగుతున్నాం. సైన్స్ పాఠం అంటే ఇంతకుముందున్న భయం పోయింది. దృశ్యం చూడటం వల్ల మాలో ఎంతో మార్పు చూడగలుగుతున్నాం. ఇంతకు ముందు పాఠాలు అంటే ఆసక్తి ఉండేది కాదు. ఇప్పుడు ఆసక్తి పెరిగింది.

– బి.నవీన్, 10వ తరగతి, చల్లసముద్రం హైస్కూల్

విద్యార్థుల్లో మార్పే లక్ష్యం



విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు కృషి చేస్తున్నాం. తరగతి గదుల్లో చదివిన పాఠాలు విద్యార్థులకు గుర్తుండిపోయేలా చేసేందుకు ప్రొజెక్టర్ బోధన ఎంతో సత్ఫలితాలనిస్తోంది. తరగతి గదిలో విన్న పాఠాన్ని మళ్లీ ప్రొజెక్టర్‌లో చూడటం వల్ల విద్యార్థుల్లో మార్పు వస్తోంది. విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతోంది.

– పిల్లి శ్రీనివాస్, హెచ్‌ఎం, చల్లసముద్రం హైస్కూల్

‘పోడు’ పంపిణీపై విచారణ జరిపించండి



మాట్లాడుతున్న గుగులోత్ ధర్మా

సింగరేణి(కొత్తగూడెం): పోడు పట్టాల పంపిణీపై సమగ్ర విచారణ జరిపి, అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ ధర్మా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కొత్తగూడెంలోని మంచికంటి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజమైన హక్కుదారులకు పట్టాలివ్వకుండా అన్యాయం చేశారని ఆరోపించారు. పోడు పంపిణీకై అధికారులు విడుదల చేసిన జాబితాలో ఒక విధంగా, పంపిణీ చేసింది మరో విధంగా ఉందని, అధికారులు పంపిణీ చేసిన జాబితాను, పట్టాలను మరోమారు పరిశీలించాలని డిమాండ్ చేశారు. పోడు కొట్టని ప్రదేశంలో లేనివారికి భూమిని కట్టబెట్టటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బృందాన్ని పంపించి అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీజాబాయి, హీరాలి, బిక్కునాయక్, చిన్న గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాంట్ విస్తరణ పనులు నిలిపివేయాలి



మాట్లాడుతున్న ప్రదీప్

కొత్తగూడెంరూరల్: ప్రజారోగ్యానికి హానికరంగా ఉన్న ఐటీసీ 8వ ప్లాంట్ విస్తరణ పనులు నిలిపివేయాలని యువజన కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 1970లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ఆధ్వర్యంలో కార్పొరేట్ పరిశ్రమ కోసం 500 ఎకరాలు స్థలాన్ని ఇచ్చారని, ఇందులో ఐటీసీని ఏర్పాటు చేశారన్నారు. పది వేల టన్నుల ఉత్పత్తి లక్ష్యంతో ఒక యూనిట్ ఏర్పాటు చేసి ఐదు దశాబ్దాల కాలంలో ఏడు యూనిట్ల స్థాయికి చేరుకుందన్నారు. ప్రస్తుతం 8వ ప్లాంట్‌ను 1/70 యాక్టుకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టిందన్నారు. తక్షణమే ప్లాంట్ విస్తరణ పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సీఎస్‌ఆర్ నిధులను తూతూ మంత్రంగా ఖర్చు చేస్తున్నారనే తప్ప మెరుగైన వైద్యం, విద్య అందించడం లేదని విమర్శించారు. గడ్డం రాజశేఖర్, సుధీర్‌కుమార్, రవితేజ, శ్యామ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కరువు

కొత్తగూడెంఅర్బన్: పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో విద్యావ్యవస్థను సీఎం కేసీఆర్ భ్రష్టు పట్టిస్తున్నరని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ఆరోపించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. దేశంలో వివిధ రాష్ట్రాలు విద్యారంగానికి 15 శాతానికి పైగా నిధులు కేటాయిస్తుంటే, తెలంగాణలో మాత్రం కేవలం 6 శాతం మాత్రమే కేటాయిస్తూ బహుజన బిడ్డలకు విద్యను దూరం చేసే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. మన ఊరు–మన బడి గురించి గొప్పలు చెప్పుకుంటూ మసిపూసి మారేడు కాయ చేస్తున్నారని ఆరోపించారు. తొమ్మిళ్లలో స్కూళ్లలో మౌలిక సదుపాయాల కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వ విద్యను పరిరక్షించి, ప్రైవేటు విద్యా వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంధం మల్లికార్జున్‌రావు, వంగా రవిశంకర్, జర్పుల కల్యాణ్, గుగులోత్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

టేకులపల్లి: తొమ్మిదో మైలు తండాకు చెందిన ధరావత్ రమేష్ లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చేర్పించారు. నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ గురువారం రూ.2లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని రమేష్ తమ్ముడికి అందజేశారు.

విద్యార్థి నాయకుల అరెస్ట్‌కు నిరసన



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

జూలూరుపాడు: వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసులు లాఠీచార్జ్ చేసి అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ గురువారం జూలూరుపాడులో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి పవన్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం వామపక్ష విద్యార్థి సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్‌కు పిలునివ్వడం జరిగిందన్నారు. హైదరాబాద్, ఖమ్మం, వికారాబాద్, సిద్దిపేట, హన్మకొండ, రంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, నిజామాబాద్ జిల్లాల్లో విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసులు లాఠీచార్జ్ చేసి, అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థల దుస్థితి ఎలా ఉందో సాక్షాత్తూ సీఎం కేసీఆర్ మనమడే చెప్పాడని, ఇప్పటికైనా ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలన్నారు. యాసా నరేష్, బోడా అభిమిత్ర, అనిల్, కార్తీక్, జగన్, దినేష్, సుమంత్, గౌతమ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ



పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న చైర్మన్ డీవీ, కమిషనర్ అంకుషావలీ

ఇల్లెందు: రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి పట్టణంలో కాలువలు, డ్రెయినేజీలు పొంగిపొర్లుతున్నాయి. పట్టణంలోని వార్డుల్లో, సైడుకాలువల్లో ఇటీవల చెత్తా చెదారం పేరుకుపోయి వర్షపునీరు నిలుస్తుండటంతో చెత్తను తొలగించేందుకు ముమ్మరంగా శానిటేషన్ పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో గురువారం శానిటేషన్ పనులను మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ అంకుషావలీ పర్యవేక్షించారు. కౌన్సిలర్లు కటకం పద్మావతి, ఆజం, నవీన్ ఉన్నారు.

పంచాయతీ భవన నిర్మాణాలు చేపట్టండి



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించేందుకు ప్రజాప్రతినిధులు శ్రద్ధ తీసుకోవాలని డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్పంచ్‌లతో ఆయన సమావేశమయ్యారు. మండలంలో 29 గ్రామపంచాయతీలు ఉండగా ఇప్పటి వరకు కేవలం సుభాష్‌నగర్, బాలాజీనగర్, ఇందిరానగర్, పోచారంతండా గ్రామపంచాయతీలకు మాత్రమే స్థలం కొరత ఉందన్నారు. ఆయా పంచాయతీలలో స్థలం సమకూర్చేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధగా ఉన్నారని, సత్వరమే సంబంధిత అధికారులను సంప్రదించి భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలన్నారు. మరో వారంరోజుల్లో అన్ని గ్రామపంచాయతీల భవనాల నిర్మాణాలు ప్రారంభించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీఓ చిరంజీవి, కార్యదర్శులు పాల్గొన్నారు.

కులవృత్తులను పరిరక్షించాలి



తహసీల్ ఎదుట ఆందోళన చేస్తున్న నాయిబ్రాహ్మణ సంఘం సభ్యులు

ఇల్లెందు: నాయి బ్రాహ్మణ వృత్తిని రక్షించాలని, ఇతర కులాలు, కార్పొరేట్ సంస్థలు తమ వృత్తిలోకి ప్రవేశించడాన్ని అడ్డుకోవాలని, ప్రభుత్వం ప్రత్యేక జీఓ విడుదల చేసి పటిష్ట చర్యలు తీసుకోవాలని నాయిబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర నాయకుడు జీవీ భద్రం, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ముత్యాల లక్ష్మణ్, మావునూరి వెంకటేశ్వర్లు కోరారు. గురువారం ఇల్లెందులో సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్న వారి పట్ల సమాజంలో చిన్న చూపు, దాడులు జరుగుతున్నాయని ఇలాంటి వాటిపై ఎస్సీ, ఎస్టీ తరహాలో ప్రత్యేక చట్టం తీసుకొచ్చి తగిన గౌరవం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎనగందుల రాకేష్, కంది కొమురయ్య, కోడెపాక శ్రీనివాస్, నడిగోటి కోటయ్య, మాధారపు వెంకటేశ్వర్లు, ఆవుదుర్తి మల్లయ్య, రాసమల్ల వెంకటేశ్వర్లు, కంది మహేందర్, నీటిగొండ రాజు, ముత్యాల రవి, ఎలగందుల కిరణ్, సారంపల్లి రాజేష్ పాల్గొన్నారు.

‘ఆరోగ్యలక్ష్మి’ని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న సీడీపీఓ నిర్మలాజ్యోతి

జూలూరుపాడు: మండలంలోని కొత్తూరు గ్రామ పంచాయతీ పెద్ద హరిజనవాడ అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఐసీడీఎస్ చంద్రుగొండ ప్రాజెక్టు సీడీపీఓ నిర్మలాజ్యోతి ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. చిన్నారుల తల్లులు, గర్భిణులు, బాలింతలతో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. లబ్ధిదారులకు గుడ్లు అందజేసేందుకు ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు చేపట్టిందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతినెలా గుడ్లు, ఇతర పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎం.లక్ష్మి, నాగమణి, అంగన్‌వాడీ టీచర్ జయ, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

రక్షణపై కార్మికులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న గోపాలరాజు

టేకులపల్లి: నా రక్షణే నాబాధ్యత.. నా రక్షణే నా కుటుంబ రక్షణ.. అనే నినాదంతో కార్మికులు రక్షణ సూత్రాలు పాటిస్తూ విధులు నిర్వహించాలని కార్పొరేట్ సేఫ్టీ జీఎం గోపాలరాజు అన్నారు. ఈ మేరకు గురువారం కోయగూడెం ఓపెన్‌కాస్టుని సందర్శించారు. కేఓసీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్‌పీఈసీ ఆఫ్ లోడింగ్ ఉద్యోగులకు రక్షణపై అవగాహన కల్పించారు. ప్రతి కార్మికుడు డిస్ట్రిబ్యూషన్ తరువాత రక్షణకు సంబంధించిన పది సూత్రాలను తప్పకుండా పాటించాలని, ఎస్‌ఓపీలను అర్థం చేసుకోవాలని, సరైన రక్షణ పరికరాలను వినియోగించాలన్నారు. ప్రతి ఉద్యోగికి రక్షణే జీవన విధానం కావాలని, రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో కేఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ ఎస్‌వీఆర్ ప్రహ్లాద్, మేనేజర్ సౌరభ్ సుమన్, రక్షణాధికారి కేఎస్‌ఎన్ రాజు ఎలక్ట్రికల్ వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ బి.నాగేశ్వరరావు, పిట్ సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నిజస్వరూపం బయట పడింది..



ఇల్లెందురూరల్: రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఇల్లెందురూరల్: రైతుల పట్ల కాంగ్రెస్ నిజస్వరూపాన్ని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బయటపెట్టారని బీఆర్‌ఎస్ నాయకులు దిండిగల రాజేందర్, హరిసింగ్‌నాయక్, పులిగళ్ల మాధవరావు అన్నారు. ఉచిత విద్యుత్‌పై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్‌ఎస్ నాయకులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో ప్రదర్శన చేసి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేసి దహనం చేశారు. మాట్లాడుతూ.. 65 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో రైతుల సంక్షేమం, అభివృద్ధికి ఏనాడూ నోచుకోలేదన్నారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ 24 గంటలు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తూ రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలతో రైతులకు అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో శీలం రమేష్, పర్సూరి వెంకటేశ్వరరావు, ఖమ్మంపాటి రేణుక, నెమలి ధనలక్ష్మి, వల్లాల మంగమ్మ, ఆళ్ల నాగేశ్వరరావు, మేకల శ్యాం, డేరంగుల పోషం, గిన్నారపు రాజేష తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేకి, ఉచిత విద్యుత్ లేకుండా చేసి రైతులకు అన్యాయం చేసేందుకు కుట్ర చేస్తోందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్ అన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఉచిత విద్యుత్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం రైతులకు మద్దతుగా టేకులపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో కంభంపాటి శ్రీనివాస్‌చౌదరి, చీమల సత్యనారాయణ, బాణోతు రామ, బాణోతు కిషన్, మౌలానా, బాలు, కిరణ్, రవి, భిక్షం, సురేష్, నాగేందర్ పాల్గొన్నారు.

పొంగిపొర్లిన వాగులు, వంకలు

సుజాతనగర్: మండల వ్యాప్తంగా గురువారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు ఏకధాటిగా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. తాత్కాలిక రోడ్డు కొట్టుకపోయాయి. పల్లపు ప్రాంతాలలోని పలు ఇళ్లలో వరద నీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

జూలూరుపాడు: నైరుతి రుతుపవనాల ప్రభావం కారణంగా బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం వరకు మండలంలో 11.54 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పలు గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలు గ్రామాల్లోని పత్తి పంట నీట మునగగా, మిరపనారు మడులు దెబ్బతిన్నాయి. చెరువులు, కుంటల్లోకి వరదనీరు చేరింది.

పంటలకు మేలుచేసిన వర్షం

పాల్వంచరూరల్: విత్తనాలు విత్తిన తర్వాత మొలకెత్తిన పంటలకు గురువారం కురిసిన వర్షం మేలు చేసిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. పత్తి, వరి, పెసర, మొక్కజొన్న తదితర పంటల మొక్కలు ఎండిపోతున్న తరుణంలో ఈ వర్షం బతికించిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

ఇల్లెందురూరల్: బుధవారం రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకు మండలంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. వివిధ పంటల విత్తనాలు విత్తిన రైతులు ఆనందపడ్డారు.

టేకులపల్లి: మండలంలో గురువారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు కుండపోత వాన పడింది. టేకులపల్లి సెంటర్‌లోని ప్రధాన రహదారి జలాశయంగా మారింది. కాలువలు, వాగులు ఉధృతంగా ప్రవహించాయి.



టేకులపల్లిలో జోరుగా వాన..



సుజాతనగర్: కోమటపల్లి గ్రామంలో పొలాలను ముంచెత్తిన వరద

కళ్లకు గంతలతో జీపీ కార్మికుల నిరసన



జూలూరుపాడులో నిరసన తెలుపుతున్న గ్రామ పంచాయతీ కార్మికులు

పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె గురువారం ఎనిమిదో రోజు కొనసాగింది. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో కళ్లకు గంతలు కట్టుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. మాట్లాడుతూ.. సమ్మెను కనీసం మండల అధికారులు కూడా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని నాయకులు కోరారు. – సాక్షి నెట్‌వర్క్



చుంచుపల్లి: కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు



ఇల్లెందురూరల్: నిరసన ప్రదర్శన చేస్తున్న కార్మికులు



సుజాతనగర్‌లో...



పాల్వంచరూరల్: పంచాయతీ కార్మికుల సమ్మె శిబిరం వద్ద మాట్లాడుతున్న నరాటి ప్రసాద్